



కొత్త మాష్టారు జేరారు స్కూలులో అని క్షణంలో పాకిపోయింది; రామారావు తన జాయినింగ్ రిపోర్టు యిచ్చీ యివ్వకుండానే. చేతికి వాచీలు ఉన్నా, స్కూలు టైము చూద్దామనో- లేక ఖాళీపెట్టెలో ఉత్తరాలు ఏమైనా ఉన్నాయేమో అనో- లేకపోతే జేబులోడబ్బులేకపోయినా జీతంకట్టే పేరుతోనో- గబగబా కొందరు పిల్లలు హెడ్మాష్టరు గది దగ్గరికివచ్చేసి కిటికీలోంచి రామారావునుచూసివెళ్తున్నారు. హెడ్మాష్టారి ఎదురుగుండా కుర్చీలో కూచొని ఉన్నారు, ఒక కళ్ళజోడు. సన్నగా ఒక్క పల్చగా వున్నట్టుంది వాటం. హెడ్మాష్టారి గది దగ్గరగా ఎప్పుడూ కనిపించని లాబరేటరీఅటెండరును లోపల చూడటంతో, ఆ వచ్చినతను సైన్సుమాష్టారని పోల్చుకోడానికి అట్టేసేపు పట్టలేదు విద్యార్థులకి.

కిందటి జనవరిలో సైన్సుమాష్టారికీ లెక్కల మాష్టారికి ట్రాన్సఫర్లు రావడంతో, అప్పటినుంచి దిక్కూ దివాణం లేకుండా ఉన్నాయి సైన్సు, లెక్కలు ఆస్కూలులో. సోషల్‌మాష్టారే ఆ సంవత్సరం సైన్సు లెక్కలు కూడా చెప్పి పిల్లల్ని పబ్లిక్ పరీక్షకి పంపాడు అతి కష్టంమీద. ఆ చుట్టుపక్కల అన్ని స్కూళ్ళతో పాటు ఆ స్కూలులోకూడా పాస్ అయ్యారు నూటికి ముప్పై మంది. ఈ సంవత్సరంఆగస్టులోనే కొత్తమాష్టారు వచ్చేశారు కనక పరిస్థితులు ఇంకొంచెం బాగుండవచ్చు అనుకున్నారు కొందరుబుద్ధిమంతులైనవిద్యార్థులప్పుడే.

హెడ్మాష్టారు సోషల్ మాష్టార్ని పిల్చి లాబరేటరీ ఛార్జీ అప్పగించమని ఆర్డరు యివ్వడం వల్ల, అటెండరుతో పాటు ఇద్దరు మాష్టర్లూ లాబరేటరీకి బయలుదేరారు. స్కూలులో ఓ పక్కగా ఉంది లాబ్. వెనక వైపు ఒక బడితోట ఉంది. పక్కనే ప్రహరీ, ఆ గోడ వెంబడే వేపచెట్లు. ప్రహరీ అవతల అంతా ఖాళీ స్థలమూ, అక్కడక్కడ వాయిలు తుప్పలూను. పరిసరాలు ప్రశాంతంగా ఉన్నాయి అనుకున్నాడు రామారావు. పరికరాలు అన్నీ వివరంగా ఛార్జీ తీసుకోడం మొదలుపెట్టాడు ఆ రోజే.

మూడు రోజులు పట్టింది అన్నీ తాను చూచుకోడానిక్కి. 'లాబరేటరీ పేరుకు నా పేరున ఉన్నా, బాధ్యతలు నీకు కూడా ఉన్నాయయ్యా, అటెండర్! నాతో సహకరిస్తావనుకుంటాను" అన్నాడు సైన్సు మాస్టారు రామారావు. ఆ అటెండరు తన సర్వీసులో చూస్తే 24 వ సైన్సుమాష్టరు రామారావు! నవ్వుతూ, 'తప్పకుండానండి ' అన్నాడు అటెండరు, బీరువాల తాళాలు రామారావుకిస్తూ. ఛార్జీ తీసుకున్నట్టు హెడ్మాష్టరుగార్కి చెప్పడానికి తానూ సోషల్ మాష్టారు కలిసి ఆఫీసుకి వెళ్లారు. క్లాసు పుస్తకాలు, టైమ్‌టేబుల్ టీచింగ్ నోట్సులు, డష్టరూ అవీ తీసుకొని రామారావు లాబ్‌కి వచ్చేశాడు తిరిగి.

అప్పటికి టైము మూడయింది. ఇంకో గంటన్నర దాకా వ్యవధి ఉంది స్కూలు విడిచిపెట్టడానికి రేపటినుంచి అన్ని క్లాసులూ తీసికోవాలి. ఆందోళనలూ, అల్లర్లూ లేకుండా అన్నీ సవ్యంగా నడిచే మార్గ్గి పదిహేనుకలా పబిక్ పరీక్షలకు

సిద్ధంచేయాలి పిల్లల్ని. ఉన్నవాళ్ళు నలభై మందట. సైన్సు లెక్కలూ కూడా తానే చెప్పాలిట లెక్కలు మాష్టారు శేరుగా. ఈ రోజుల్నిబట్టి చాలా ముఖ్యమైనవి ఈ రెండు సబ్జక్ట్సూను తన బాధ్యత చాలా పెద్దది. రేపటి లెక్కల పాఠాలు తను రూములో చూచుకోవచ్చు సైన్సు పాఠాలకి కావలసిన పరికరాలన్నీ ఈ వేళ సిద్ధం చేసుకోవాలి. అవసరమైతే ప్రయోగాలు చేసుకొని రిహార్సలు వేసుకోవాలి ఈవేళే.

మరునాటి క్లాసులకి కావలసిన ఏర్పాట్లన్నీ చేసుకొని లాబ్ తాళాలు వేయించుకొని రామారావు స్కూలులోంచి బయలుదేరేటప్పటికి ఐదున్నర అయింది. స్కూలు గ్రౌండ్సులో పిల్లలాడుకొంటున్నారు షటల్ కాక్ ఓ చోట, బాస్కెట్ బాల్ ఓ చోట ఆడుతున్నారు వాళ్ళు ఓ సారి తనకేసి చూసి 'కొత్త మాష్టారోయ్!' అని ఒకళ్లు "ఆ కళ్ళజోడు చూడరా" అని ఒకళ్ళు - ఏవేవో అనడం వినబడినట్లు వెళ్ళిపోయాడు రామారావు బయటికి. మూర్తి హోటలుకు వెళ్ళి అరకప్పు కాఫీ తాగి గబ గబ సత్రవుకి వెళ్ళాడు. చాలా పనిఉంది ఈవేళ అనుకుంటూ.

# 2

ఇన్‌షర్టు వేసిన బట్టలు చిలక కొయ్యకి తగిలించి, వేరే టెరికాట్ ఫాంటు, షర్టు, తొడిగాడు రామారావు. రూమ్ తాళం వేసి, సత్రవు వాచ్‌మన్‌తో చెప్పాడు రాత్రి పదింటికి వస్తానని మళ్ళీ బయలుదేరాడు వేటకి. ఎన్నాళ్ళుంటాడు సత్రంలో. ఓ వారం రోజులలో కనక ఒకవాటా దొరికితే, భార్యా కొడుకుని తీసుకరావచ్చు. వచ్చినప్పటినుంచి రోజూ ఇదేపని, సాయంత్రమూ పొద్దున్నా పూటకో వీధి ఎక్కడా కనిపించడం లేదు ఖాళీలు ఫోషల్ మాష్టారితో చెప్పాడు మొదటి రోజునే. కాని ఆయన చూద్దాం అని ముభావంగా చెప్పేసి ఊరుకున్నాడు తనకింకా మిగిలినమాష్టర్లతో బాగా పరిచయం లేదు అంచేత, తనకి తానే బయలుదేరాడు ఒక ఫామిలీ పోర్షన్ కోసం వెదుకుతూ.

మెయిన్‌రోడ్ మీంచి ఎడమపక్క సందులోకి తిరిగాడు రామారావు. రెండిళ్ళవతల ఒక టు లెట్ బోర్డు ఒక దొడ్డి గుమ్మానికి కనిపించింది. ఆ పెంకుటింటి వీధి గుమ్మం తలుపు కొట్టాడు రామారావు 'వస్తున్నా నెవరో' నంటూ, అవ్వగారొకావిడ తలుపు తీసింది. "పక్కవాటా అద్దెకిస్తారండి?'

"ఎంతమంది బాబూ ఉండేది?' 'ముగ్గురమండి".

"ఆడవాళ్ళా, మొగవాళ్ళా' 'నేనూ, నా భార్యా, పని కుర్రాడూ ఉంటామండి." 'ఆడవాళ్ళని తీసుకు రండి, వాటా చూపెడతాం." అని చటుక్కున వెనక్కి తిరిగింది అవ్వగారు తలుపు వేస్తూ రామారావు మనస్సు గతుక్కుమంది.

ఈవేళ ఎక్కడవస్తుంది భార్య? ఆడవాళ్ళు రానిదే ఇల్లే చూపెట్టనంటోంది ఈ మహాతల్లి. తన మనమరాల్నెవరినైనా లేవదీసుకు పోతానను కుంటోంది కాబోలు! అనుకొని తిట్టుకుంటూ ఇంకాముందుకు వెళ్ళాడు రామారావు. అక్కడక్కడ రామారావుకి అరుగులుమీద తడికెలు అద్దెకిట్టి తునికి ఆకుకట్టలు పేర్చి కనిపించాయి ఊరుచూస్తేచిన్నది. కాని ఇళ్ళ ఖాళీలుమాత్రం కనిపించడంలేదు. ఊళ్ళో పెద్ద పొగాకు కంపెనీలు రెండు ఉన్నాయి. పైపెచ్చు ఏ ఇంటివైపుచూసినా ఆ బీడీ ఆకు కట్టలు కనిపిస్తున్నాయి. వీటితోటే అద్దెలుకూడా ఎక్కువైపోయుంటాయి. నిన్న అంచేతే మూడు గదుల డాబా భాగానికి ఎనభై అడిగారు హైద్రాబాద్‌ను మించిపోయింది ఈ ఊరు అనుకున్నాడు నిన్న.

ఆ సందు చివరికి వెళ్ళేటప్పటికి ఒక వచారీ షాపు ఆ పక్కనే సెలూన్ ఒకటి కనిపించాయి. ఇక్కడ అడిగితే ఖాళీలేమైనా ఉంటే తెలుస్తాయను కున్నాడు సైన్సుమాష్టారు రామారావు. సెలూన్

ooooooooooooooooooooooooooo

బజార్లో ఎదురుపడ్డ పోస్టుమన్‌ను పట్టుకొని అడిగాడు నా కేమయినా ఉత్తరం వచ్చిందా? అని ఓ విద్యార్థి.

"ఓ కవరువచ్చిందిసార్ అది మీయింట్లో ప్రక్కాయనకు ఇచ్చానుసార్"

"చంపావ్ పో! ఆ ఆసామి కూతురే నయ్యా ఉత్తరంరాసింది" వాపోయాడు ఆ విద్యార్థి.

—సుభాషిణి

ooooooooooooooooooooooooooo

ప్రొప్రైటర్ రామారావుకేసి ఎగాదిగాచూస్తూ 'పెద్ద అద్దెతో చిన్నఇల్లుకావాలా, చిన్న అద్దెతో పెద్దఇల్లు కావాలా, సార్?' అని అడిగాడు గుమ్మంబయట వేసుకున్న పడకకుర్చీలో నిటారుగా కూచుంటూ. రామారావు, 'అంటే?" అన్నాడు ప్రశ్నార్థకంగా రోడ్డుమీద నిలబడి. మరేం లేదండి- అదిగో చూడండి ఆ నూతిపక్క డాబా, లోపలివైపున నూతిదగ్గర రెండుగదులున్నాయి. డాబాగదులు, సబ్‌మీటరుంది కావలసినంత గాలి, వెలుతురు, వున్నాయి. దొడ్డిగుమ్మంలోంచి మసులుకోవచ్చు. లెట్రిన్ బాత్‌రూమ్‌లతో సహా... అంతా సెపరేట్' 'ఇంతకీ అద్దె చెప్పరేం?" వచ్చకాగితం మాత్రంట సార్'.

"మనవల్ల కాదు. మరి- ఆ రెండో ఇంటిమాట ఏమిటి?"

'దానికి డబ్బుకాదు కావలసింది. ధైర్యం!" రామారావు కర్థంకాలేదు. ధైర్య మెందుకు? కజ్జాకోరు కొంపా?"

'అబ్బెబ్బె, అదేంకాదు సార్. అదొక పెద్ద మేడ కాని.."

'కాని?' 'మరేంలేదు - ఆ మేడ నాలుగు నెలలనుంచీ తాళం వేసి ఉంటోంది. ఎవరూ రావడంలేదట సార్. మీరు చూస్తే చూడండి.'

'ఇళ్ళు దొరకని ఈఊళ్ళో ఎవరూ రాకపోవడమేమిటి?" అని అడిగాడు ఆత్రంగా రామారావు, రోడ్డుమీద నుంచొనే. కూచోండి సార్, మరి ఆ కుర్చీలో - చెప్తాను.' అని ఎదురుగా అల్లల్లాడే ఒక కుర్చీరాజాన్ని చూపాడు రామారావుకి ఆ సెలూన్ ప్రొప్రైటర్.

ఇంతకీ, మీరేం పని చేస్తారు?" 'హైస్కూలుకి సైన్సు మాష్టరుగా వచ్చాను నాలుగు రోజుల నాడు." 'ఓహో! అయితే ఇకనేం, మీకు మంచి వీలుగా ఉంటుంది కాని..."

'మళ్ళీ కానీ ఏమిటయ్యా?' రామారావుకు కొంచెం విసుగెత్తింది 'అదికాదు మాష్టరుగారూ! ఆ మేడనే ఈ ఊళ్ళో చెక్కమేడ అంటారు. ప్రస్తుతం దానిలో చెక్కలు లేకపోయినా ఆ పేరు ఉండిపోయింది. చెక్కలు తీసేసి, స్లాబ్‌వేసి, పైన మరో రెండు గదులు కట్టాక, అందులో ఉండడానికి ఝుడుస్తున్నా రంతా. తాళం వేసి ఉంటుంది.

"ఎంచేత?"

"చెప్తా ఆ మేడ మీ స్కూలు వెనకాల సందులో రాముడు గుడిప్రక్కనే ఉంది. గోపీ చందనం వేసి ఉంటుంది. ఆ మేడపక్క పెంకుటింటో ఉంటాడా ఇంటాయన. నరసింహంగారాయన పేరు. ముసలాయన. పండిపోయిన గెడ్డం - చేతిలో కర్ర. ఆయన్ని అడగండి. ఈ ఇల్లు చూపెడ్తాడు." "ఇంతకీ ఆ ఇల్లంటే ఝుడు పెందుకో చెప్పలేదు."

"అదా! అది చెక్కమేడగా ఉన్న రోజులలో నరసింహంగారూ కుటుంబమూ ఆ ఇంట్లోనే ఉండేవారు. ఓసారి దొడ్లో నీళ్ళగది కట్టిద్దామని పునాదులు తీయిస్తున్నాడట దగ్గరుండి. ఏదో ఖంగుమని చప్పుడైందట. పలుగు దెబ్బకి తక్షణం కూలివాడిని పొమ్మని కాస్సేపటికి మళ్ళీ పిలిచాడట. తర్వాత కూలీ తవ్వి ఆ గోతిలోంచి పాత చెంబొకటి తీశాడట పైకి. కాని సాయంత్రానికల్లా రకరకాల అనుమానాలు వ్యాపించుకుపోయాయి ఊళ్లో, కూలీని బయటికి పంపించేసి నరసింహంగారు తానే స్వయంగా తవ్వేడట, ఆ ఖంగుమనేది ఏమిటో చూద్దామని.ఏవో బంగారు విగ్రహాలు దొరికాయట. వాటిని తీసి పై మీద తుండులో చుట్టేసి ఇంటో పెట్టి ఓ పాతచెంబు ఆ గోతిలో పడేసి పట్టేసి కప్పెట్టేసేడట అని చెప్పుకోడం మొదలు పెట్టారు. లంకెబిందెలు దొరికాయట అని కొందరు చెప్పుకొన్నారు. దొడ్లో చెట్లకీ, చేమలకీకూడా కళ్ళున్నాయి కాబోలు సార్" అన్నాడతను చెప్తూ చెప్తూ. 'కళ్ళేకాదు, నోరుకూడా ఉంది" అన్నాడు రామారావు నవ్వుతూ.

'బాగా చెప్పారు. మర్నాడు నరసింహంగారు పని ఆపేసి ఊరు వెళ్ళాడట. విజయవాడ అని కొందరు, రాజమండ్రి అనికొందరు చెప్పుకున్నారు. ఎక్కడికి వెడితేనేం, తర్వాత రెండు రోజులలో తిరిగివచ్చి, చకచక పని సాగించాడు నరసింహంగారు. చెక్కలు తీసేసి స్లాబ్, పైన మరో రెండు గదులు దొడ్లో సెప్టిక్ లెట్రిన్‌లు, నీళ్ళ గదులూ అవీ వేయించాడు. బావుంటుందిలెండి మేడ"

"అయితే,దాంట్లోఉండడానికి ఝుడుపెందుకు?"

'చెప్తా వినండి మరి - పని పూర్తి చేయించిన

వారం రోజులలో పాపం ముసలాయనకి తలతిప్పుతోనూ, కొంచెం జ్వరంతోను సుస్తిచేసింది రెండు రోజులు. మూడోనాటి పొద్దున తెల్లవారగానే కొడుకుని పిలవబోతే మాట రాలేదట. అంతే. మరి మాటలేదు. నాలుక పడిపోయింది. మనం చెప్పే మాటలు వింటాడు కాని, తాను పలకమీద రాసి సమాధానం చూపెడుతుంటాడు."

'మరి ఆయన పెంకుటింట్లో ఎప్పటినుంచి ఉంటున్నాడు ?"

"తండ్రికి జబ్బు చేయగానే కొడుకు భయపడిపోయాడు. ఆయన ఎలిమెంటరీ స్కూలు టీచరు. పిల్లా జల్లా గంపెడు సంసారం ఇక, తనకేమి ప్రమాదం వస్తుందో అని ఆ చిన్న స్కూలు మాష్టారు సొంత మేడ వదిలేసి ఆ పక్క ఇంటికి అద్దెకి వెళ్ళిపోయాడు. తనతోపాటు ముసలాయన కూడా వెళ్ళిపోక తప్పలేదు."

'మరి, అప్పటినుంచి ఆ మేడలోకి ఎవరూ అద్దెకి రాలేదా?"

"రాకేం, వచ్చారు. రెండు వాటాలలోకీ వచ్చారు. చెరో ఎనభై ఇచ్చారట కూడా. నాలుగు నెలలు పోయేటప్పటికి. కుడివైపు వాటాలో ఉన్న పొగాకు కంపెనీ ఆయన భార్యకి టైఫాయిడ్ వచ్చి పోయింది. తర్వాత రెండు నెల్లకి ఎడమ వాటాలో ఉండే రెవిన్యూ ఇనస్పెక్టరుగారిని లంచాలు తీసుకున్నాడని సస్పెండుచేసి తర్వాత డిస్‌మిస్ చేశారట కూడా. రెండు వాటాలవాళ్ళూ ఖాళీచేసి వెళ్ళిపోయారు."

"మరి అప్పటినుంచి ఖాళీగానే ఉండిపోయిందా మేడ ?"

"అంతేసార్ ఎవరు ఆ ఇంట్లో ప్రవేశించినా, భార్య పోతుందో, కాకపోతే ఉద్యోగం పోతుందో అని భయపడి పోయారు. మీకేమైనా ధైర్యముంటే చవకగా దొరుకుతుంది, ఆ మేడ చూడండి," అని సలహా ఇచ్చాడు ఆ సెలూన్ ప్రొప్రైటర్.

'అద్దె ఎంతట ?"

"కుడివైపు వాటా తీసుకొంటే నలభై కిస్తానంటున్నాడు నాలుగునెలలనుంచి నరసింహంగారు. కింద మూడు గదులు, పైన రెండు గదులు ఉన్నాయి."

'సరే. థాంక్స్. చూస్తాను " అని రామారావు మాష్టారు చక చక ముందుకు సాగాడు స్కూలు వైపు ఆ ఇళ్ళకి దారి గుర్తుచేసుకుంటూ.

## 3

కొత్త సైన్సు మాష్టారు ముప్పైఐదు రూపాయలకే చెక్కమేడలో వాటా తీసుకున్నారని మర్నాటి పొద్దున్నకల్లా పాక్కిపోయింది స్కూలంతా. 'పాపం, కొత్త! ఆ ఇంటి సంగతి తెలియదు కాబోలు!' 'చవగ్గా వచ్చిందని దిగి ఉంటాడు." 'స్కూలు దగ్గరగా! సెకండుబెల్లు కొట్టాక రావచ్చు అనుకొని ఉంటాడు.' అట్లాట్లా రకరకాలుగా అనుకున్నారు. చిన్నా పెద్దా స్టాఫులో. అటెండర్ మాత్రం 'ఏం సార్ ? ఆ చెక్కమేడలో వాటా తీసుకున్నారటగా ? ఆ కొంప సంగతి తెలుసా?" అని అడిగాడు. డిమాన్‌స్ట్రేషన్ టేబుల్‌మీద పాఠానికికావలసిన పరికరాలు ఏర్పాటు చేస్తూ. 'ఆ! విన్నాను. టైఫాయిడ్ వైరస్‌కి ఇంటికి సంబంధం ఏమిటి ? లంచాలు పుచ్చుకున్నవాడు ఏనాటికైనా సర్వ మంగళం పాడకేం చేస్తాడు ? ఆ ఇల్లు నన్నేం చేస్తుంది?"రామారావు టీచింగ్‌నోట్స్ చూసుకుంటూ అటెండర్ చిన్నగా నవ్వి ఊరుకున్నాడు.

తర్వాత రెండు రోజులలో రామారావు పేరు స్కూలులోనూ, స్కూల్లోంచి ఊళ్ళోకి వ్యాపించడం మొదలు పెట్టింది. సైన్సు పాఠానికి సంబంధించిన ప్రయోగం లేనిదే పాఠం చెప్పడు రామారావు మాష్టారు. "టాక్-ఛాక్' పద్ధతివాడుకాదు రామారావు. హస్క్ వేయడు. తెలియకపోతే మళ్ళీఅడగమంటాడు మళ్ళీ చెప్తాడు.అందరూ సైన్సుమాష్టారు క్లాసులో శ్రద్ధగా కూచ్చుంటున్నారనికూడా పాకిపోయింది ఊళ్ళోకి

---

## "వన్స్‌మోర్"

"పాతివ్రత్య మహత్యం" అనేనాటకం ప్రదర్శిస్తున్నారు. ఆ నాటకం ఒక సీనులో పూరాగా తాగేసివచ్చిన భర్తకాళ్ళకు అడ్డం పడుతున్న భార్యామణిని అదేపనిగా తన్నేసున్నాడు. పైగా పాటపాడుతూ చరణానికి ఒకటి చొప్పున తాపులు ప్రసాదిస్తున్నాడు.

రసజ్ఞులైన ప్రేక్షకలోకానికి ఆపాటా, ఆ నటన బాగానచ్చి అదేపనిగా 'వన్స్ మోర్'లు కొట్టుతున్నారు.

పతివ్రతవేషం వేసిన ఆ సతీమణికి ఒళ్ళంతా హూనం హూనం అయిపోయింది.

అమాంతం లేచినుంచుని కాలిజోడుతీసి నటశేఖరుణ్ణి ఎడాపెడా వాయించేసింది.

---

సైన్సు, లెక్కలూ కూడా స్టాఫులో బాగాచెప్తాడని తెలియగానే, 'ట్యూషన్ చెప్తారా, సార్?" అని ఒకళ్ళిద్దరు అడిగారు రామారావుని ఒక రోజున ఇంటర్వెల్‌లో. పెద్దవాళ్ళని తీసుకుని ఇంటికి రండి మాట్లాడదాం అన్నాడు రామారావు ముక్తసరిగా మధ్యాహ్నం పాఠాలకి కావలసినప్రయోగాలుచూసుకుంటూ.

## 4

ఆ రోజునుంచి రామారావు మాష్టారు దగ్గర ట్యూషన్లకి జేరడం మొదలు పెట్టారు పిల్లలు. అందరూ పబ్లిక్ పరీక్షకి వెళ్ళేవాళ్ళే. మరో క్లాసు పిల్లలను తను పెట్టుకో దల్చుకోలేదు వీళ్ళుకూడా ఉదయం అరడజను. సాయంత్రం నరసింహంగారి మనవడితో సహా మరో అరడజనుమంది. మెడిసిన్‌లో జేరేవాళ్ళకి సీట్లయిపోయినట్టే రామారావు మాష్టారి దగ్గర ట్యూషన్‌కి సీటు యిక లేవు ! మిగిలిన మాష్టార్లు నవ్వుకున్నారు. ఇంటిదగ్గర కూడా ఇంకో స్కూలు పెట్టక ఏమిటీ రామారావు పిచ్చి అని. ట్యూషన్ పేరు చెప్పి జేరిన పిల్లలు, చదువు వచ్చినా రాకపోయినా, ఎంతమంది పాస్ కావడంలేదు ? రామారావుకా గొడవలతో పనిలేదు. తన మతం ఏదో తనది.

జీతం అందుకొన్నాక శలవు పెట్టి వెళ్ళి రామారావు కుటుంబాన్ని తీసుకువచ్చాడు. చెక్కమేడలో ప్రవేశించాక, రెండు రోజులలో భార్య చెవిని పడ్డాయి అమ్మలక్కల కబుర్లు ఆ మేడ గురించి. రామారావు స్కూలునుంచి రాగానే సాయంత్రం టీ ఇస్తూ. 'ఈ మేడ గురించి పుకార్లు విన్నారా ?" అని అడిగింది ఆమె. 'నాన్సెన్స్ అవేంనమ్మకు. అర్థంలేని పుకార్లు " అని తెంపేశాడు రామారావు ఇక ఆ సంభాషణ పాకుతూ గుమ్మం దగ్గరికి వచ్చిన కొడుకు తనని చూసి నవ్వాడు టీత్రాగేసి స్టీల్ కప్పు గుమ్మం దగర పెట్టా రామారావు కొడుకునెత్తుకుని ముద్దెట్టుకొన్నాడు.

రోజులు గబగబ దొర్లిపోతున్నాయి ఆరోగ్యంగా రామారావుకుటుంబం ఆ వాటాలోఉంటుంటేఆఊరు తెల్లబోయింది. ఆఖరికి పడిశం కూడా పట్టి ఎరగరు ఎవరూ ఆ కుటుంబంలో! పైగా, ప్రైవేట్లతో నాలుగు రూపాయలు సంపాదిస్తున్నాడు. స్కూలులో సమర్థుడని తన మానాన తను పోతాడని పేరు తెచ్చుకున్నాడు రామారావు.

ఇది చూసేటప్పటికి చెక్కమేడలో రెండో వాటా కూడా అడగడం మొదలుపెట్టారు నరసింహాన్ని మళ్ళీ. ఇంత కన్న ఒక గది తక్కువైనా ఆ వాటాని అరవై రూపాయలకి తీసుకున్నాడు పొగాకు కంపెనీ హెడ్ గుమాస్తా. నరసింహంగారు చాలా సంతోషించాడు,, తన మేడ నేటికో వచ్చు కాగితం నెలా ప్రసాదిస్తున్నందుకు.

పబ్లిక్ పరీక్షలు దగ్గిరికి వచ్చేటప్పటికి అందరికీ క్లాసు మార్కుల రికార్డు తయారవడం మొదలైంది. ఆ మార్కులు అక్కడక్కడ పారితోషకాల ప్రభావం వల్ల మెరుగెక్కుతున్నాయి కొన్ని కొన్ని సబ్జక్టుల్లో. సైన్సులో మార్కులు రామారావు ట్యూషన్ పిల్లలికికూడా ఉన్నవి ఉన్నట్టు ఉండిపోవడంతో కలకలం బయలుదేరింది ఊళ్ళో. రామారావు మాష్టారిమాటలు గుర్తుండకపోలేదందరికీ. ట్యూషన్‌లో జేర్చుకొనేటప్పుడే చెప్పాడు ట్యూషన్ ఫీజ్‌కీ, క్లాసుమార్కులకీ ఏమీ సంబంధం ఉండదని. మిగిలిన మాష్టర్లుకూడా మాటవరసకి అమాటే చెప్పినా వాళ్ళ చేతుల్లో ఉన్న సర్దుబాట్లు ఎన్ని చేయడంలేదు ? కాకపోతే, అదనంగా తృణమో ఫలమో అందరిలాగే తానుకూడా అడిగితే కాదంటారా ? ససేమిరా అంటే ఒప్పుకోలేదు అట్లాంటి వాటికి సైన్సుమాష్టారు రామారావు.

నరసింహంగారుకూడా ఓ ఆదివారం మధ్యాహ్నం పలకతీసుకొని, చేతికర్ర ఆసరాచేసుకొని రామారావు ఇంటికి వచ్చాడు. శలవుకదా అని మాట్నీకి వెళ్దామనుకుంటున్నాడు రామారావు అప్పుడు. నరసింహాన్ని చూడగానే గ్రహించాడు రామారావు విషయం. కుర్చీ చూపెట్టి, పక్కనే

మరో కుర్చీ లాక్కొని కూచొని నరసింహం పలక మీద వాక్యం పూర్తిచేయకుండానే చెప్పేశాడు సమాధానం మర్యాదగా.

'మీ మనవడు ట్యూషన్‌వల్ల వెనకటికన్న బాగున్నాడు నరసింహంగారూ మంత్లీ ప్రోగ్రెస్ చూసే ఉంటారుమీరు. అంతకన్న నేనేంచేయలేను. ఒక్కొక్కళ్ళమీద చూపగల్గినంత శ్రద్ధ విడివిడిగా చూపుతున్నాను. తప్పకుండా పాస్ అవుతాడు. మీ మనవడు" నరసింహంగారు పలకమీద. "మరి [illegible] . అని రాశారు.

'మార్కులు వచ్చాక చూద్దాండి ఆ విషయం. నే వింతకన్న ఏమీ చేయలేను." అని వాచీకేసి చూస్తూలేచాడు రామారావు కుర్చీలోంచి. వెనక గదిలో భార్య గాజుల గలగలలు వినిపిస్తున్నాయి.

నరసింహంలేచి, కనుబొమ్మలు చిట్లించి రామారావును ఎగాదిగాచూసి చరచర వెళ్ళిపోయాడు. టకటక కర్ర నేలమీద చప్పుడుచేసుకుంటూ. తాను ఇల్లు ఇచ్చాడు కనకగాని లేకపోతే రామారావుకి ఇల్లు దొరికేదా? హెడ్‌గుమాస్తా అనవై ఇస్తుంటే, రామారావుకి కొత్తగా ముప్పై ఐదుకే ఇందుకేనా ఇచ్చింది? తనతడాఖా ఇంకా ఎరగడు ఈ కుంకఅనుకుంటూవెళ్ళిపోయాడా ముసలాయన.

సాఫీగా పబ్లిక్ పరీక్షలు జరిగిపోయినాయి పరీక్షలకి వాచర్లుగా ఇతర ఊళ్ళకి వెళ్ళిన మాష్టర్లంతా క్షేమంగా తిరిగి ఇళ్ళకి చేరారు. మిగిలిన క్లాసులు మామూలుగా పనిచేయడం మొదలు పెట్టాయి. ఎండలు ముదురుతున్నాయి. కనక మోర్నింగ్ స్కూల్సు పెడుతున్నారు రేపటినుంచని నోటీస్ వచ్చింది.

## 5

మర్నాడు ఉదయం తొమ్మిదవుతుండగా కూడా ఇంకా కొందరు పిల్లలు స్కూలుకు వస్తూనే ఉన్నారు పుస్తకాలు తీసికొని. కొందరు పల్లీల కోసం గేటువగర రోడ్డుమీద పల్లీలబండి దగ్గరికి వెళ్తున్నారు. ఆ వేరుశనగకాయల బండి తప్పుకొని స్కూలులోకి ఎవరో కొత్తమనిషి వెళ్ళడమూ ఆయన లోపలికి వెళ్ళిన రెండు నిముషాలలో పైలు ఒకటి చంకనిపెట్టుకొని ఒకరు, అప్రక్కనే ఒక బిళ్ళబంట్రోతు స్కూలులోని వెళ్ళడంచూశారు పల్లీలు కొరుక్కు తింటున్న పిల్లలు.

క్షణంలో పాకిపోయింది డి. ఇ. ఓ. గారు వచ్చారని. ప్రోగ్రాం ఇవ్వకుండా రావడంతో అంతా కంగారు పడిపోయారు. హెడ్మాష్టారు మోరల్ క్లాసుకి వెళ్ళకుండా అర్జంటు ఆఫీసు కాగితాలు చూసుకోడం డి. ఇ. ఓ. గారి దృష్టిలో పడింది "గేటు దగర తినుబండారాల బళ్ళు మీరే ఏర్పాటు చేశారా, హెడ్మాష్టారూ? లాభాలు బాగా వస్తున్నాయా?" అని అడిగారు ఆఫీసరుగారు. ఓర కంటితో చూస్తూ. అబ్బెబ్బె లేదుసార్! - ఈవేళే నేను స్కూలులోకి వచ్చేటాక వచ్చారు కాబోలు వాళ్ళు సార్" అని తడబడ్డాడు హెడ్మాష్టరుగారు. "ఐసీ' అని ఊరుకున్నారు ఆఫీసరుగారు. వారి క్యాంప్ గుమాస్తాగారు ఆఫీసు ఎక్కౌంట్లు అవీ చెక్ చేయడం మొదలుపెట్టారు.

ఆఫీసరుగార్కి హెడ్మాష్టరుగారు స్కూలంతా చూపారు. రామారావు లాబరేటరీ పిల్లలు ప్రయోగాలు చేస్తుంటే వాళ్ళ మధ్య ఉన్నాడు. ఓ విద్యార్థికి పరికరాలు ఏర్పాటుచేసుకోవడం చేతకాకపోతే ఏర్పాటుచేసి చూపి మళ్ళీ సొంతంగా ఏర్పాటుచేయమంటున్నాడు రామారావు ఆసమయానికి. గిరుక్కున తిరిగివెళ్ళిపోయారు వాళ్ళిద్దరూ.

కాస్సేపటిలో సైన్సుమాష్టారికి కబురువచ్చింది.

రామారావు కంగారుపడ్డాడు కొంచెం. ఇందాక ఆఫీసర్‌గార్కి దణ్ణం పెట్టనందుకు కోపం వచ్చి కబురంపారుకాబోలు అనుకుంటూ. లీడరునుక్లాసు చూసుకోమని వెళ్ళాడు రామారావు డి. ఇ. ఓ.

హెడ్మాష్టారి సీట్లో డి. ఇ. ఓ. గారు కూచొని ఉన్నారు. హెడ్మాష్టరుగారు స్వయంగా గుమాస్తా గారికేవో లెక్కలు వివరిస్తున్నారు. వెళ్ళి తాను నమస్కారం చేయగానే కూచోమన్నాడు రామారావుని ఆయన. తన ఎదుట ఉన్న కుర్చీలో. 'థాంక్స్ సార్! అంటూ కూచున్నాడు రామారావు. ఆఫీసరుగారు ఒక నిముషం ఆగి, "మీ పేరు?" అని అడిగారు. చెప్పాడు రామారావు మాష్టారు. "మీకు జీతాలు సరిగా యిస్తున్నారా?" 'ఆ ఇస్తున్నారండి,' "మరి, ఆ జీతం మీకు సరిపోతోందా?" 'పిల్లాజెల్లా ఎక్కువ ఉన్నవాళ్ళకి చాలదేమోగాని నాకు సరిపోతోందండి' "అయితే మీరు ట్యూషన్లు చెప్తున్నారట. ఎందుకని?" "మా పిల్లల్ని టెక్నికల్ కోర్సులకి పంపుకుంటాం లెక్కలూ, సైన్సు ట్యూషన్ చెప్పమని అడిగితే పోన్లే అని చెప్తున్నా సార్!" 'ఇంకా? "మా వాడు పబ్లిక్‌లో పాస్ కాడేమో, బోర్డర్లో ఉంటాడు అని భయపడుతున్నాం కాస్త లెక్కలలో ట్యూషన్ చెప్పండని అడిగితే అట్లాంటి వాళ్ళకే చెప్తున్నా సార్!" "అంతేనా?' "అంతే, సార్!"

"ట్యూషన్లు చెప్పవచ్చా రామారావుగారూ!" 'పెద్దలు, తమరే శలవీయాలి ఈ పరిస్థితులలో ట్యూషన్లు చెప్పమంటారో వద్దంటారో!" "క్లాసు మార్కులు ఉదారంగా వేయడానికి మార్కుకెంత పుచ్చుకుంటున్నారు?" రామారావుకి ఒళ్ళు మండింది ఈ ప్రశ్నకి. ఎవడో గడ్డి తింటే తాను కూడా తిన్నట్టేనా? నేను దిద్దిన పేపర్లలో ఒక్క మార్కు తేడా వేసి ఉంటే డిస్ మిస్ చేయండి సార్" అన్నాడు రామారావు ఉద్రేకంతో. 'చూస్తాను. మీరు వెళ్ళవచ్చు". అన్నారు డి. ఇ. ఓ గారు తాపీగా టేబుల్ బెల్ నొక్కి. రామారావు వెళ్ళిపోయిన తర్వాత ఆఫీసర్‌గారు మంత్లీ పేపర్ల కట్టలు హెడ్మాష్టరుగారిదగిర తీసుకొని చూశారని తెలిసింది రామారావుకి.

డి. ఇ. ఓ. గారు వచ్చి వెళ్ళిపోయిన వారానికల్లా సైన్సు మాష్టారు రామారావుకి మన్యం వెంకటాపురం బదిలీ ఆర్డర్లు వచ్చాయని ఊరంతా గుప్పుమంది ఒక్కసారి. నరసింహం విడిచిపెట్టిన తోక పిట్టదే ఈ తన్ను అనుకున్నారు కొందరు రామారావు వెళ్ళిపోతే భీమారావు వస్తాడులే అన్నారు కొందరు చెక్కపేడ దెబ్బకొట్టిందని అనుకోకపోలేదు సెలూన్‌లో కూచొని మరి కొందరు.

★

## చంద్రమండల సముద్రాలు : కొత్తసిద్ధాంతం

రెండు. మూడు మిలియన్ల సంవత్సరాల క్రితం లావా (అగ్నిపర్వతాలనుంచి రాయి కరిగి ప్రవహించే ద్రవం) బైటికి స్రవించడానికి అనుకూల పరిస్థితు లున్నప్పుడు వర్తులాకారపు సముద్రాలు ఏర్పడ్డాయి.

ఆ కాలంలో చంద్రగోళపు లోపలి భాగం రేడియో ధార్మిక మూల పదార్థాల మూలంగా కరిగి లావాపైకి స్రవించిందని శాస్త్రజ్ఞుల భావన. ఆ లావాస్రవం అకస్మాత్తుగా వచ్చినప్పుడు లేదా వర్తులాకారపు సముద్రాలనుంచి పొంగి పొరలినప్పుడు క్రమం తప్పిన వంకరటింకర రూపాలలో వుండే సముద్రాలు వచ్చాయి.

లావా పైకి స్రవించడం మూలంగానే చంద్రమండలంమీద సముద్రాలు ఏర్పడ్డాయని చాలామంది చంద్రమండల పరిశోధకులు చాలకాలంగా నమ్ముతున్నారు. అయితే దీన్ని బలపర్చే నిర్దిష్టమైన రుజువులు లేవు.

సోవియట్ యూనియన్ పంపిన "లూనా - 10" "లూనా - 12" ఆటోమేటిక్ రోదసీనౌకల సహాయంతో తీసిన చంద్రమండల ఉపరితలం నిర్మాణపు కొలతలు ఈ సిద్ధాంతాన్ని ధృవపరుస్తున్నాయి. చంద్రమండల సముద్రాలలో బసాల్ట్ వుందని అవి తెల్పుతున్నాయి

చంద్రగోళపు లోపలి భాగంనుంచి పైకి స్రవించిన లావాతో పాటు బ్రహ్మాండమైన ఉష్ణంకూడా పైకివచ్చేయడం వలన చంద్రగోళం క్రమంగా చల్లబడింది. అందుచేత ఇప్పుడున్న దశలో చంద్రమండలంలో లావాపైకి స్రవించడానికి అనుకూల పరిస్థితులు లేవని రెండు మూడు మిలియన్ల సంవత్సరాల క్రితమే అలాంటి పరిస్థితు లుండేవని శాస్త్రజ్ఞులు భావిస్తున్నారు.

ఈ లావా స్రావం చంద్రమండల ఉపరితలం అంతటా జరగక భూమికి కనిపించే వైపున మాత్రమే జరిగినట్లు రుజువు అయింది. అయితే అలా ఎందుకు జరిగిందో మాత్రం ఇంకా స్పష్టం కావడంలేదు.